క్లుప్తంగా

డీఎంగా ప్రసన్నలక్ష్మి



నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కె.ప్రసన్నలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎం ప్రసన్నలక్ష్మి కోరుట్ల డిపో నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ తొమ్మిది నెలల పాటు పని చేసిన డీఎం విజయమాధురి కోరుట్ల డిపో మేనేజర్‌గా మంగళవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

గీసుకొండ డీటీగా ఉమారాణి

గీసుకొండ : డిప్యూటీ తహసీల్దార్(డీటీ)గా ఉమారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సంపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. గీసుకొండలో పని చేసిన డీటీ రంజిత్ వర్ధన్నపేట ఎన్నికల సెల్‌కు బదిలీ అయ్యారు.

అభినందన

నర్సంపేట : నర్సంపేటకు చెందిన ఏఎస్‌ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మంగళవారం ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. కాగా రాజశేఖర్‌ను స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ బుధవారం అభినందించారు.

నూతన కార్యవర్గం



పర్వతగిరి : మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోనె సంపత్, గౌరవ అధ్యక్షుడిగా బాసాని రామస్వామి, గడుదాసు వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా బాసాని సత్యనారాయణ, కార్యదర్శిగా గోనె సంపత్, ఉపకార్యదర్శిగా ఆడెపు ప్రభాకర్, కోశాధికారిగా బాసాని భిక్షపతి, ఉప కోశాధికారిగా గుడ్ల రామ్మూర్తితో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోనె సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా మూడు సార్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీఎన్జీఓలు



సంగెం : మండల తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్‌ను బుధవారం టీఎన్జీఓలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ ఆధ్వర్యంలో పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, పాలకుర్తి సదానందం, మురధర్‌రెడ్డి, రాజు, రామకృష్ణ, రాజేష్, రవికుమార్, నాగేశ్వర్‌రావు, చిరంజీవి, భరత్, రమేష్ తదితరులు ఉన్నారు.

గీసుకొండ తహసీల్దార్‌ను..

గీసుకొండ : తహసీల్దార్‌గా ఇటీవల విధుల్లో చేరిన ఎండి రియాజుద్దీన్‌ను టీఎన్జీఓస్ నాయకులతో పాటు పలువురు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. అలాగే మొగిలిచర్ల మీ సేవా నిర్వాహకులు చేర్ల రాజు, దళిత బంధు మండల చైర్మన్ కోట ప్రమోద్, బీఆర్‌ఎస్ యూత్ మండల నాయకులు చల్లా రాజ్‌కుమార్‌లు సన్మానించిన వారిలో ఉన్నారు.

నేడు వేలంపాట

రాయపర్తి : మండలంలోని కొత్తూరు గ్రామంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ వేలంపాట నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎండీ అస్మా, సర్పంచ్ కందికట్ల స్వామి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11:30గంటలకు నిర్వహించే ఈ వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చేసి రశీదు కలిగి ఉండాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ రూంలను పొందినవారు గ్రామపంచాయతీ నిబంధనలను పాటించాలన్నారు.

బ్యాంకులో కుంభకోణంపై దర్యాప్తు?

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కార్తీక్ బ్యాంకు నగదును తన సొంతానికి వాడుకున్న విషయం పాఠకులకు విదితమే. అయితే ఈకేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు. డిప్యూటీ మేనేజర్ కార్తీక్ ఒక్కడే రూ.8.5 కోట్ల కుంభకోణం చేశారా? ఏవరైనా ఉన్నతాధికారులకు కార్తీక్ సహకరించారా? ప్రతి సంవత్సరం బ్యాంకులో ఆడిట్ జరుగుతుంది కదా, అసలు ఆడిట్‌లో ఎందుకు ఈ కుంభకోణం బయటపడలేదు అనే కోణంలో విచారణ ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా ఒక ఉద్యోగి ఇంత పెద్ద మొత్తంలో నగదు వాడుకోవడం నర్సంపేట పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ కుంభకోణానికి అసలు కారణం ఆన్‌లైన్ గేమింగే ప్రధాన కారణమని మరికొందరు చర్చించుకుంటున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



రాయపర్తి: పెర్కవేడులో బోనాలతో వెళ్తున్న మహిళలు



సంగెం: పల్లారుగూడలో..



చెన్నారావుపేట: నృత్యం చేస్తున్న మహిళలు



ఖానాపురం: బోనాలతో వెళ్తున్న మహిళలు

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, తిర్మలాయపల్లి, రాగన్నగూడెం తదితర గ్రామాల్లో గ్రామదేవతలైన ముత్యాలమ్మ, మారెమ్మ దేవతలకు బుధవారం బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని తిర్మలాయపల్లిలో బోనాల పండగ ఉత్సవాల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు బోనం ఎత్తుకొని మొక్కులు చెల్లించారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్, ఎంపీటీసీలు గజవెల్లి అనంత, చిన్నాల తారశ్రీరాజాబు, బండి అనూషరాజబాబు, పూస మధు తదితరులు పాల్గొన్నారు. పెర్కవేడుకు చెందిన నక్క శేఖర్ తల్లిదండ్రులు గతంలో మృతిచెందడంతో తానే స్వయంగా బోనం ఎత్తుకొని మొక్కులు చెల్లించాడు.

సంగెంలో..

సంగెం : తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. బుధవారం పల్లారుగూడలో మహిళలు గ్రామ దేవత పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. పాడిపంటలు, పిల్లపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామంలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండుగను బుధవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు బోనాలతో వెళ్లి గ్రామ శివారులో ఉన్న పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య మొక్కులు చెల్లించుకున్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాలల్లో బుధవారం పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో గ్రామ శివారులోని పోచమ్మ దేవాలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు. చల్లంగా చూడు తల్లి అని వేడుకున్నారు.

ఎరుకలకు సీఎం కేసీఆర్ పెద్దపీట



కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎరుకల సంఘం నాయకులు

నర్సంపేట : ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో ఎరుకలకు పెద్దపీట వేశారని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం కుర్ర సత్యనారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం పట్ల ఎరుకల సంఘం నాయకులు కేతిరి రాజశేఖర్, రాయపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎరుకలను గుర్తించి ఆదివాసీ ఎరుకల ముద్దు బిడ్డ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ స్థానం కల్పించి ఎరుకల ఆత్మ గౌరవాన్ని కాపాడారని అన్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మనుపాటి రమేష్, రాయపురం పెద్ద రాజు, జగన్నాథం, రమేష్, దుగ్యాల సదన్న, పాలకుర్తి రాజేందర్, రాయపురం కట్టయ్య, పాలకొండ రజనీకాంత్, పాలకుర్తి అనిల్, రమేష్, సదానందం, పులిచేరి చిన్నరమేష్, రాజేందర్, రమేష్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పర్వతగిరి : మండలంలోని రావూరు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ మేరకు బుధవారం సర్పంచ్ బండి సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో బస్సులను రావూరు గ్రామం మీదుగా నడపాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావూరు, కల్లెడ గ్రామాల మీదుగా ప్రత్యేక బ్రిడ్జిని ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికి ఆర్టీసీ అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయం అన్నారు. రావూరు మీదుగా వెళ్లిన, కల్లెడ మీదుగా బస్సులు దూరం విషయంలో సమానంగా ఉంటుందని తెలిపారు. రావూరు మీదుగా వెళ్లడం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో పలుమార్లు తొర్రూరు, నర్సంపేట డిపో మేనేజర్లకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రావూరు మీదుగా బస్సులు వెళ్లేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల కలలను సాకారం చేసేది కాంగ్రెసే..

● మాజీ ఐపీఎస్ కేఆర్.నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

వర్ధన్నపేట : పేదల కలలను సాకారం చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని మాజీ ఐపీఎస్ అధికారి కేఆర్.నాగరాజు అన్నారు. పల్లెనిద్రలో భాగంగా కదారిగూడెం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పాలనలో సాగుకు ఉచిత విద్యుత్, విద్యుత్ బకాయిల మాఫీ, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ, 108 సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారని, ఎందరో విద్యార్థులను ఉన్నతస్థాయికి ఎదిగేవిధంగా చేశారన్నారు. సమావేశంలో నాయకులు బొంపెల్లి దేవేందర్‌రావు, చోటేమియా, కృష్ణారెడ్డి, కమ్మగోని ప్రభాకర్, ఎద్దు సత్యనారాయణ, గుంటి కుమారస్వామి, గుజ్జ రవీందర్‌రెడ్డి, మల్లెపాక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి పాఠశాలలో 2007–08బ్యాచ్‌లో చదివిన ముద్రబోయిన సాంబరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బుధవారం తోటి స్నేహితులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.28,300లను ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో గజవెల్లి ప్రసాద్, గోగుల రమణాకర్, మామిడాల రమేష్, మేడ సుధాకర్, జలగం యాకయ్య, మునిగాల రాజశేఖర్, సుంకరి సతీష్, గిరగాని శ్రీను, గూడూరు ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యం



భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు

వర్ధన్నపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సమాఖ్య భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారని వర్ధన్నపేట ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఏఎంసీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు అన్నారు. మండలంలోని 12 గ్రామాల మహిళా సంఘాలకు నూతన సమాఖ్య భవనాల నిర్మాణాల నిమిత్తం ఒక్కొక్క భవనానికి రూ.15 లక్షల చొప్పున ఎమ్మెల్యే అరూరి రమేశ్ మంజూరు ఇప్పించగా బుధవారం ఆ గ్రామాల్లో పర్యటించి నూతన భవనాలకు స్థలాలు అసంపూర్తిగా మిగిలిన భవనాలను సందర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సర్పంచ్‌లు గుజ్జ సంపత్‌రెడ్డి, మంద సతీష్, ఆరెల్లి స్రవంతి, ఎంపీటీసీ అన్నమనేని ఉమాదేవి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న పీఓ అంకిత్, ఎంపీపీ

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట గ్రామానికి చెందిన 16 ఇళ్లు కూలిపోగా 20 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. దీంతో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, జెడ్పీటీసీ బత్తిని స్వప్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాగా వెంటనే ఐటీడీఏ పీఓకు సమాచారం ఇవ్వడంతో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. నష్టపోయిన బాధితులకు బుధవారం ఏటూరు నాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీఓ అంకిత్, ఎంపీపీ ప్రకాశ్‌రావు చేతుల మీదుగా రూ.1.60లక్షలతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు.

అన్నదానం

రాయపర్తి : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు వజినపల్లి శైలజశ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని సన్నూరులో లయన్ వజినపల్లి శైలజ–శ్రీనివాస్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా 400 మందికి అన్నదానం చేశారు.

ఇంటింటా ప్రచారం

చెన్నారావుపేట : మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్‌కుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో గడప గడపకు యువజన కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, గ్రామపార్టీ అధ్యక్షుడు గూడ మహేందర్, కూస వెంకట్‌రెడ్డి, కూస సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కందిక ప్రవీణ్‌కమార్, పెండ్లి రాజేందర్, విజయ్, రాకేష్, రాజు, తదితరులు ఉన్నారు.

బాలికల హాస్టల్‌లో సీట్ల సంఖ్య పెంచాలి



హాస్టల్ ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని బీసీ కళాశాల బాలికల హస్టల్‌లో సీట్ల సంఖ్యను పెంచాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ అన్నారు. ఈ మేరకు హస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట పట్టణానికి వివిధ మండలాల నుంచి ఉన్నత విద్యను అభ్యసించేందుకు దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నర్సంపేటకు ప్రతిరోజు ప్రైవేట్ వాహనాలలో, బస్సుల్లో ప్రయాణిస్తూ విద్యను అభ్యసిస్తున్నారు. చాలా మంది బీటెక్, బీఫార్మసీ, డిగ్రీ, పీజీ, ఇంటర్ చదువుకునే విద్యార్థినులు నర్సంపేట బాలికల హస్టల్‌కు సీట్ల కోసం వెళ్తుండగా సీట్లు తక్కువగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దు, ప్రశాంత్, ప్రవళిక, గంగ, అమూల్య, రమ్య, హరిమ, శాంతి, వసంత, ప్రియాంక, మేఘన తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

సంగెం : మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2012–13లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం కలుసుకుని నాడు విద్యాబుద్ధులు నేర్పిన లింగారెడ్డి, రాజయ్య, సత్యవతి, సంతోష్‌కుమార్, మురళి గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అఖిల్ యాదవ్, పండుగ శివకృష్ణ, మహేందర్ నాయక్, అడ్డగట్ల వంశీ, డబ్బెట నాగరాజు, బీమన్న, అశోక్, శిరీష, సంధ్య, మౌనిక, శిరీష పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న డాక్టర్ మదన్‌కుమార్



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మాధవరెడ్డి

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన ఉప్పరి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందాడు. కాగా వెంకటేశ్వర్లు చిత్రపటానికి బహుజన ఐక్య వేదిక నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ గుండాల మదన్‌కుమార్ బుధవారం పూలమాల వేసి నివాళులర్పించి రూ.5వేల సాయం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ డ్యాగల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు హంస విజయ రామరాజు, కో కన్వీనర్, బీఎస్పీ నాయకులు ఒంటరి రాములు, వెంకన్న, స్వామి ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

నెక్కొండ : మండలంలోని అమీన్‌పేట శివారు టేకులకుంట (టీకే) తండా జీపీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు తేజావత్ జామ్లా(55) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బుధవారం మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామన్నారు. మృతుడికి భార్య పున్నమ్మ, కుమారుడు ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నాయకులు కుసుమ చెన్నకేశవులు, మాలోత్ శ్రీనివాస్, అనిల్, తేజావత్ వంశీ, భద్రు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడ్ల భిక్షంరెడ్డి తల్లి బక్కమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం పరామర్శించారు. జగన్ మోహన్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



భూక్యా రవి (ఫైల్)

పర్వతగిరి : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మోత్యతండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాలు.. మోత్య తండాకు చెందిన భూక్యా రవి(35) కొంత కాలంగా కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం తండా శివారులోని పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు పిచికారీ చేశాడు. మందు ప్రభావంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. దీంతో ఈనెల 8వ తేదీన హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఈర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రంగాపురంలో భూతగాదా.. దాడి

ఖానాపురం : మండలంలోని రంగాపురంలో భూతగాదాలో జరిగిన గొడవ దాడి వరకు వెళ్లింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన యాకయ్య, మొగిళి మధ్య భూ తగాదా జరుగుతుంది. ఈ క్రమంలో పంట పొలం వద్దనే బుధవారం మరోసారి ఘర్షణ చోటు చేసుకోవడంతో యాకయ్యపై మొగిళితో పాటు మరికొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరు వర్గాలు పోలీసులను ఆశ్రయించగా స్టేషన్ సమీపంలోనూ మరోసారి ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. గాయాలపాలైన యాకయ్యను ఆస్పత్రికి తరలించారు. ఇదే విషయంపై ఎస్సై మాధవ్‌ను వివరణ కోరగా ఇరువర్గాలు స్టేషన్‌కు వచ్చారని, గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఫిర్యాదులు మాత్రం అందలేదని చెప్పారు.

నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్ ముఠాపై విచారణ?

నర్సంపేట రూరల్ : వాహనాల నంబర్ ప్లేట్లు, కాగితాలు మార్చే ముఠాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నర్సంపేట డివిజన్‌లో ఈ ముఠా జోరుగా దందాను సాగిస్తుందన్న పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి సుమారు 50 వాహనాల వరకు సీజ్ చేసినట్లు తెలిసింది. ఈముఠాపై లోతుగా అధ్యయనం చేస్తే మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి రావొచ్చని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలామందిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. ఈవిషయం బయటకు వస్తే మిగిలిన వారు జాగ్రత్త పడుతారని, గోప్యంగా ఉంచుతూ పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పాఠశాలలో విద్యార్థికి తేలుకాటు

దుగ్గొండి : మండలంలోని స్వామిరావుపల్లికి చెందిన కోరికల అభి స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. కాగా బుధవారం మధ్యాహ్నం పాఠశాలలో తేలుకాటు వేయడంతో ఉపాధ్యాయురాలు సుల్తానాబేగం దుగ్గొండి పీహెచ్‌సీకి, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. పాఠశాల ఆఫీస్ రూంలో అభితో పుస్తకాలను సరిచేయించడం వల్లనే తేలు కాటు వేసిందని సర్పంచ్ అంబరగొండ సుమలత తెలిపారు. విద్యార్థి చేత పనిచేయించి ప్రమాదానికి కారణమయిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇట్టి విషయంపై మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణను వివరణ కోరగా విద్యార్థి స్కూల్ బ్యాగులోనే తేలు ఉందని తేలు కుట్టగానే ఉపాధ్యాయురాలు ఎంజీఎంకు తీసుకెళ్లారన్నారు. విద్యార్థికి ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు



ఖానాపురం : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని బాల్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మరావుపేట గ్రామానికి చెందిన వెంకన్న రోజు మాదిరిగానే కుల వృత్తిలో భాగంగా బాల్‌తండా శివారులో తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడటంతో కాలు, చేయి విరిగాయి. దీంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఆస్పత్రికి తరలించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



నర్సంపేట : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బుధవారం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్డేపల్లి నర్సింహరాములు, రేసు శ్రీనివాస్, చిలువేరు రజనిభారతి, పంజాల రాము, కొంపెల్లి రాజేందర్, జూలూరి మనీష్, గూడూరు సందీప్, ప్రవీణ్‌కుమార్, సప్తగిరి పాల్గొన్నారు.

ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం: మాజీ ఎమ్మెల్యే రేవూరి

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మూల స్తంభాలైన ఉద్యోగుల బతుకులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు నర్సంపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడున్నర ఏళ్లుగా నెల వారి వేతనాలు 10నుంచి 15వ తేదీ వరకు చెల్లిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రతి నెల రెండో తేదీన వేతనాలు చెల్లించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే ఉద్యోగుల బతుకులు బాగుపడతాయని, అప్పుల కుప్పగా మిగిలిన రాష్ట్రం మరింత ఆగం కాకుండా ఉంటుందని తెలిపారు.